శరవేగంగా రహదారుల అభివృద్ధి

తుది దశకు చేరిన పేరూరు–గోడిలంక ఆర్‌అండ్‌బీ రోడ్డు


పేరూరు–గోడిలంక ప్రధాన రహదారి

అల్లవరం: మండలంలోని ప్రధాన రహదారులను అందంగా తీర్చిదిద్దుతామని ప్రకటన చేసిన టీడీపీ ప్రభుత్వం తీరా అధికారంలో వచ్చిన తర్వాత హామీలను గాలికొదిలేసింది. ఐదేళ్ల పాటు అధికారంలో ఉన్న అప్పటి ఎమ్మెల్యే ఆనందరావు ప్రధాన రహదారులకు కనీస మరమ్మతులను సైతం చేయించకుండా నిర్లక్ష్యం చేశారు. కనీసం ఒక్క రోడ్డుని కూడా ఆధునీకరించకపోవడంతో టీడీపీ మోసాన్ని గుర్తించిన ప్రజలు గత ఎన్నికల్లో బుద్ధి చెప్పారు. గత సార్వత్రిక ఎన్నికల అనంతరం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలో అధికారంలోకి వచ్చిన వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ప్రధాన రహదారులను విస్తరించి ప్రయాణం సాఫీగా సాగేందుకు అందమైన రోడ్లను నిర్మిస్తామని హామీ ఇచ్చారు. ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చేందుకు మంత్రి విశ్వరూప్, ఎంపీ చింతా అనురాధ చొరవ తీసుకున్నారు.

ప్రధాన రహదారుల విస్తరణ

మండలంలోని ప్రధాన రహదారుల విస్తరణకు శ్రీకారం చుట్టి శరవేగంగా పనులు జరిపించారు. తొలుత గోడిలంక నుంచి బెండమూర్లంక వరకూ సీఆర్‌ఎఫ్ నిధులు రూ.12 కోట్లతో రోడ్డుని విస్తరించారు. రెండో దఫాగా పేరూరు నుంచి గోడిలంక వరకూ, బెండమూర్లంక నుంచి ఓడలరేవు వరకూ సీఎస్‌ఆర్ నిధులు రూ.25 కోట్లతో రహదారి విస్తరణ చేపట్టారు. పేరూరు నుంచి గోడిలంక వరకూ నిర్మిస్తున్న రోడ్డు నిర్మాణం తుది దశకు చేరుకోగా అల్లవరం మసీదు నుంచి హైస్కూల్ వరకూ సీసీ రోడ్డు నిర్మాణం ఇప్పటికే పూర్తి చేశారు. బెండమూర్లంక నుంచి ఓడలరేవు వరకూ రోడ్డు విస్తరణ పనులు ప్రారంభం కావాల్సి ఉంది. మండలంలో మరో ప్రధాన రహదారైన గుడ్డివానిచింత నుంచి ఎస్.పల్లిపాలెం వరకూ రోడ్డు విస్తరణకు మంత్రి పినిపే విశ్వరూప్ చొరవతో సీఆర్‌ఎఫ్ నిధులు రూ.19 కోట్లు మంజూరయ్యాయి. ప్రస్తుతం రోడ్డు విస్తరణ పనులు జరుగుతున్నాయి. మరో రెండు నెలల్లో ఈ రోడ్డు పనులు పూర్తి చేసి మండల ప్రజలకు అంకితం చేయనున్నారు. మండలంలోని ప్రధాన రహదారులను ఆధునీకరించి నగరాలను తలపించేలా విస్తరించారని ప్రజలు ఆనందాన్ని వ్యక్తం చేస్తున్నారు.

ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పనిచేయాలి


ఉప్పలగుప్తం మండల సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ జానకి

- ఎంపీపీ దంగేటి వీర అచ్యుత జానకి
- ఉప్పలగుప్తం మండల సర్వసభ్య సమావేశం

ఉప్పలగుప్తం: అధికారులంతా ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పనిచేయాలని, ప్రభుత్వ సంక్షేమ ఫలాలు లబ్ధిదారులకు చేరేలా కృషి చేయాలని ఎంపీపీ దంగేటి వీర అచ్యుత జానకి అన్నారు. శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఆమె అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎంపీపీ దంగేటి వీర అచ్యుత జానకి మాట్లాడుతూ ప్రతీ మండల సమావేశంలో అధికారుల దృష్టికి తీసుకొస్తున్న సమస్యలను పరిష్కరిస్తున్న దాఖలాలు కనిపించడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించి ప్రజలకు సేవలందించాలని సూచించారు. ప్రజల కోసం ప్రభుత్వం ఎన్నో సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నా అధికారుల అసమర్థత, నిర్లక్ష్యం కారణంగా ప్రభుత్వానికి చెడ్డ పేరు వస్తుందని జెడ్పీటీసీ సభ్యుడు గెద్దం సంపదరావు మండిపడ్డారు. తాను మండలంలో ప్రభుత్వ ఉపాధ్యాయునిగా 30 ఏళ్ల పాటు పనిచేశానని, ప్రస్తుతం అధికారుల తీరు చూస్తుంటే ప్రభుత్వ ఆశయాలకు భంగం కలిగించేలా వ్యవహరిస్తున్నారన్నారు. సన్నవిల్లి గ్రామంలో ఎండీయూ వాహన దారుడు రేషన్ బియ్యం ప్రజలకు అందించడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారని చర్యలు తీసుకోవాలని ఎంపీటీసీ సభ్యురాలు వంగా గిరిజాకుమారి సభ దృష్టికి తీసుకొచ్చారు. ఇదే సమస్య ఎస్.కొత్తపల్లి, ఉప్పలగుప్తం గ్రామాల్లో సైతం ఉందని వారిని వెంటనే తొలగించాలని మండల పార్టీ అధ్యక్షుడు బద్రి బాబ్జి, రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్ చీకట్ల కిషోర్, ఎస్.కొత్తపల్లి సొసైటీ అధ్యక్షుడు నడింపల్లి వాసురాజులు కోరారు. విలసవిల్లి గ్రామంలో గానుగచెరువు నుండి భీమనపల్లి వరకూ ఉన్న రెవెన్యూ డ్రెయిన్ పూడిక మేటలు వేయటంతో రైతులు ఇబ్బంది పడుతున్నారని సర్పంచ్ ఊర్మిళాదేవి డ్రెయిన్స్ అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. అదే విధంగా గొరగనమూడి మైనర్ డ్రెయిన్ పూడికలు తీయాలని సర్పంచ్ చిక్కం జంగమయ్య కోరారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ సాదే శ్రీనివాసరావు, వైఎస్సార్ హార్టికల్చర్ బోర్డు సభ్యుడు జిన్నూరి వెంకటేశ్వరరావు, ఎంపీటీసీల సమాఖ్య అధ్యక్షుడు పెట్టా అప్పారావు, సర్పంచ్‌లు పెయ్యిల రాజ్‌కుమార్, యర్రంశెట్టి రామచంద్రరావు, కుంచే బుల్లియ్య, ఎంపీటీసీలు చిక్కం త్రినాథ, కొంకి ఏడుకొండలు, కాట్రు ధనలక్ష్మి, బోగిశెట్టి సత్యవతీదేవి, అంగాని అనంతలక్ష్మి, వరసాల వెంకటలక్ష్మి, దేశంశెట్టి రత్నకుమారి, తాళ్ల లక్ష్మీనరసాయమ్మ, ఎంపీడీవో కె.వెంకటేశ్వర ప్రసాద్, ఈవో పీఆర్‌డీ కేఎస్ గౌరీకుమారి పాల్గొన్నారు.

క్లుప్తంగా

మెరుగైన వైద్యసేవలు అందిస్తాం


ఉచిత నేత్ర వైద్య శిబిరాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే అశోక్, చిత్రంలో ఆర్‌ఏఓ మునిస్వామి తదితరులు

యానాం: నియోజకవర్గ పరిధిలో పేద వర్గాలకు, తీరప్రాంత మత్స్యకారులకు మెరుగైన వైద్యసేవలు అందించేలా చర్యలు తీసుకుంటున్నామని ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్‌అశోక్ పేర్కొన్నారు. శనివారం లయన్స్ క్లబ్ యానాం పిల్లారాయ, శ్రీమతి రాజేశ్వరీ రామకృష్ణన్ లయన్స్ వైద్యశాల సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఉచిత నేత్ర వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. శిబిరానికి యానాం పరిసర ప్రాంతాలకు చెందిన ప్రజలు అధిక సంఖ్యలో తరలివచ్చారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు, కళ్లజోళ్లు పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ ప్రజలకు నాణ్యమైన వైద్యసేవలు అందించాలన్నది తన ప్రధాన లక్ష్యమని ఆవిధంగా జీజీహెచ్‌లో సేవలు మెరుగుపడాల్సి ఉందన్నారు. రోగులకు ఆసుపత్రి సిబ్బంది బాధ్యతతో సేవలు అందించాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్‌ఏఓ మునిస్వామి, లయన్స్ జిల్లా గవర్నర్ వేలూరి సూర్యనారాయణ, రీజినల్ చైర్మన్ ముదునూరి రామరాజు, జీఎల్‌టీ పెద్దిరెడ్డి ఉమామహేశ్వరరావు, లయన్స్ యానాం శాఖ అధ్యక్షుడు పులవర్తి శ్రీను, దంగుడుబియ్యం సత్యనారాయణ, సతీష్‌చంద్ర పాల్గొన్నారు.

దత్తమణికంఠ సన్నిధిలో ఎమ్మెల్యే అశోక్


దత్తమణికంఠ పీఠంలో స్వామిని దర్శించుకున్న ఎమ్మెల్యే అశోక్

యానాం: గౌతమీగోదావరి తీరంలో కొలువైన దత్తమణికంఠ ఆలయంలో శనివారం ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ అయ్యప్పస్వామి మాలధారులతో కలిసి విశేష పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా కార్తిక మాసంను పురస్కరించుకుని దత్తమణికంఠ పీఠంలో స్వాములకు బిక్ష ఏర్పాటుచేశారు. ఎమ్మెల్యే అశోక్ స్వయంగా స్వాములకు ప్రసాదాన్ని వడ్డించారు. అంతకుముందు దత్తమణికంఠ పీఠం వద్దకు వచ్చిన ఎమ్మెల్యే అశోక్‌కు భక్తులు దుశ్శాలువాతో సాదర స్వాగతం పలికారు. కార్యక్రమంలో గురుస్వాములు ఆకుల నాగేశ్వరరావు, ఆకుల మార్కండేయులు, బద్రే మల్లేశ్వరరావు, చెక్కా నూకరాజు, వాసిరెడ్డి సుబ్బారావు, సబ్బతి లోకేష్ పాల్గొన్నారు.

అరుణాచల గిరి దర్శనానికి ప్రత్యేక బస్సు


అరుణాచల గిరి దర్శనం ప్రత్యేక బస్సును ప్రారంభిస్తున్న డీఎం మూర్తి

అమలాపురం రూరల్: ఆర్టీసీ అమలాపురం డిపో నుంచి అరుణాచల గిరి దర్శనం కోసం 36 మంది భక్తులతో ఏర్పాటు చేసిన ప్రత్యేక బస్సును డీఎం చల్లా సత్యనారాయణమూర్తి శనివారం ప్రారంభించారు. ఈ బస్సు ప్రయాణంలో భక్తులు కాణిపాకం, శ్రీపురం మీదుగా అరుణాచలం పుణ్యక్షేత్రం చేరుకుని, పౌర్ణమి నాడు గిరి ప్రదక్షిణ పూర్తయిన తరువాత తిరుగు ప్రయాణంలో కంచి, శ్రీకాళహస్తి క్షేత్రాలు దర్శించుకుని తిరిగి అమలాపురం చేరుకుంటారన్నారు. భక్తుల సౌకర్యార్థం ప్రతి నెలా అమలాపురం డిపో నుంచి పౌర్ణమి రోజున అరుణాచల గిరి ప్రదక్షిణ కోసం ప్రత్యేక బస్సు సౌకర్యం ఉందని డీఎం మూర్తి తెలిపారు. మళ్లీ డిసెంబర్ 23వ తేదీన డిపో నుంచి ప్రత్యేక బస్సు బయలుదేరుతుందని, 99500 సర్వీస్ నెంబర్‌తో ఆన్‌లైన్‌లో ముందస్తుగా రిజర్వేషన్ సౌకర్యం ఉందని చెప్పారు. సూపర్ లగ్జరీ బస్సులో ప్రయాణ చార్జి పెద్దలకు రూ.2,950, పిల్లలకు రూ.2,000, ఇంద్ర ఏసీ బస్సులో పెద్దలకు రూ.4,000, పిల్లలకు రూ.3,000 అవుతుందన్నారు. ఆసక్తి గల ప్రయాణికులు మరిన్ని వివరాల కోసం 73829 09620, 99592 25550, 99592 25576 ఫోన్ నెంబర్లలో సంప్రదించొచ్చన్నారు.

108 లీటర్ల నాటు సారా స్వాధీనం


నాటు సారాను స్వాధీనం చేసుకున్న పోలీసులు

యానాం: నియోజకవర్గ శివారు సావిత్రినగర్‌లో ఓ ఇంట్లో దాచి ఉంచిన 108 లీటర్ల నాటు సారాను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ శేరు నూకరాజు శనివారం తెలిపారు. చింతా బీరవతికి చెందిన పాతబడిన ఇంట్లో నాటుసారాను స్వాధీనం చేసుకుని కేసును ఎక్సైజ్ శాఖకు అప్పగించామన్నారు.

విద్యార్థులు జనరల్ నాలెడ్జ్‌లో ముందుండాలి

కలెక్టర్ హిమాన్షు శుక్లా


మద్దాలవారిపేట ప్రభుత్వ వసతి గృహంలో టీవీని ప్రారంభిస్తున్న కలెక్టర్ హిమాన్షు శుక్లా

అమలాపురం టౌన్: విద్యార్థులు మారుతున్న ఆధునిక సాంకేతిక పరిజ్ఞానానికి అనుగుణంగా ఎప్పటికప్పుడు అప్‌డేట్ అవుతూ జనరల్ నాలెడ్జ్‌లో ముందుండాలని కలెక్టర్ హిమాన్షు శుక్లా సూచించారు. శనివారం అమలాపురం మద్దాలవారిపేటలోని సాంఘిక సంక్షేమ కళాశాల బాలుర వసతి గృహం–3ని కలెక్టర్ శుక్లా సందర్శించి విద్యార్థులకు జనరల్ నాలెడ్జ్ ప్రశ్నలు వేసి సమాధానాలు రాబట్టారు. ఈ సందర్భంగా భారతీయ స్టేట్ బ్యాంక్ సామాజిక సేవల్లో భాగంగా సీఎస్‌ఆర్ నిధుల నుంచి కొనుగోలు చేసిన ఎల్‌ఈడీ టీవీని వసతి గృహానికి బహూకరించారు. ఈ టీవీని కలెక్టర్ శుక్లా ప్రారంభించారు. ఎస్‌బీఐ తమ సామాజిక సేవలను విస్తృతం చేస్తూ ప్రభుత్వ వసతి గృహాలకు అందిస్తున్న సేవలపై సంబంధిత అధికారులను అభినందించారు. టీవీ ద్వారా విద్యార్థులకు కరెంట్ ఎఫైర్స్‌పై జనరల్ నాలెడ్జ్ పెంపొందించేలా ప్రోత్సహించాలని వసతి గృహం అధికారులకు సూచించారు. కార్యక్రమంలో జిల్లా సాంఘిక సంక్షేమ సాధికారత అధికారి పి.జ్యోతిలక్ష్మీదేవి, మున్సిపల్ కమిషనర్ ఒమ్మి అయ్యప్పనాయుడు, ఎస్‌బీఐ ప్రతినిధి రమేష్, స్థానిక వార్డు కౌన్సిలర్ నాగారపు వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఇంటర్మీడియట్ యూనిట్ పరీక్షలు


కళాశాలలో యూనిట్ పరీక్షను తనిఖీ చేస్తున్న డీఐఈవో సత్యనారాయణరెడ్డి

అమలాపురం టౌన్: జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో జరుగుతున్న ఇంటర్మీడియట్ నాలుగో యూనిట్ పరీక్షలు శనివారంతో ప్రశాంతంగా ముగిశాయని డిస్ట్రిక్ట్ ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ ఆఫీసర్(డీఐఈవో) ఎస్‌వీవీ సత్యనారాయణరెడ్డి అన్నారు. అమలాపురం ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో జరిగిన పరీక్షల నిర్వహణపై ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. శనివారం ఆయన కళాశాలను సందర్శించి పరీక్ష జరుగుతున్న తీరును తనిఖీ చేశారు. కళాశాల ప్రిన్సిపాల్ కవలు కోటిలింగంతో పరీక్షల నిర్వహణపై చర్చించారు.

ఉద్యోగాలకు దరఖాస్తుల ఆహ్వానం

అమలాపురం రూరల్: నిరుద్యోగ యువత కోసం తుని, కేశవరం దక్కన్ ఫైన్ కెమికల్స్ కంపెనీల్లో ఉద్యోగాల కోసం దరఖాస్తులు చేసుకోవాలని జిల్లా వికాస మేనేజర్ గోళ్ల రమేష్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. 27 ఏళ్ల వయసున్న అభ్యర్థులు అర్హులన్నారు. ఎంపీసీ, బీజెడ్‌సీ, సీబీజెడ్, బయో కెమిస్ట్రీలో డిగ్రీ పూర్తి చేసిన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతున్నట్లు తెలిపారు. రూ.15,000 నుంచి రూ.17,000 వరకూ జీతంతో పాటు, ఉచిత రవాణా, వసతి సౌకర్యం కల్పిస్తారన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు వికాస మేనేజర్‌ను సంప్రదించాలని కోరారు.

నేడు జ్వాలా తోరణం

ఐ.పోలవరం: ప్రముఖ పుణ్యక్షేత్రం మురమళ్ల భద్రకాళీ సమేత వీరేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం జ్వాలాతోరణం నిర్వహించనున్నట్లు ఆలయ చైర్మన్ పెన్మత్స వాసురాజు, ఈఓ మాచిరాజు లక్ష్మీనారాయణలు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. పవిత్రమైన కార్తికమాసంలో వచ్చే కార్తిక పౌర్ణమి తిథిని పురస్కరించుకుని ఆదివారం ఉదయం పంచామృత అభిషేకాలు, లఘున్యాస అభిషేకాలు, అమ్మవారికి కుంకుమ పూజలు, సాయంత్రం జ్వాలా తోరణం, అనంతరం నిత్యకల్యాణం జరుపుతామన్నారు. సోమవారం భద్రకాళీ అమ్మవారికి చండీ హోమం చేస్తామన్నారు. శనివారం అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామి వారిని, అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు.

వచ్చే నెల 9న కాపు కార్తిక వన సమారాధన


కార్తిక వన సమారాధన నిర్వహణపై చర్చిస్తున్న కాపు నాయకులు

అమలాపురం టౌన్: స్థానిక గండువీధిలోని డాక్టర్ మెట్ల సత్యనారాయణరావు కాపు కల్యాణ మండపంలో వచ్చే నెల 9వ తేదీన కాపు కార్తిక వన సమారాధన నిర్వహించనున్నట్లు సంఘం నాయకులు తెలిపారు. శనివారం కార్తిక వన సమారాధన నిర్వహణపై చర్చించేందుకు సంఘ నాయకులంతా స్థానిక కాపు కల్యాణ మండపంలో సమావేశమయ్యారు. రాజకీయ పార్టీలకు అతీతంగా ఈ వన సమారాధనకు కాపు సామాజిక వర్గీయులంతా కుటుంబ సమేతంగా పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కాపు నాయకులైన బీవీసీ ఇంజినీరింగ్ విద్యా సంస్థల అధినేత బోనం కనకయ్య, కాపు కల్యాణ మండపం ప్రతినిధి మెట్ల రమణబాబు, మాజీ మున్సిపల్ చైర్మన్లు చిక్కాల గణేష్, నల్లా విష్ణుమూర్తి, యాళ్ల నాగ సతీష్, చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు కల్వకొలను తాతాజీ, లారీ ఓనర్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వాకపల్లి స్వామినాయుడు, నల్లా స్వామి, అల్లాడ స్వామినాయుడు, యేడిద శ్రీను తదితరులు పాల్గొన్నారు.

మళ్లీ జగనే ముఖ్యమంత్రి కావాలి


చెయ్యేరులో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో కరపత్రాలను అందచేస్తున్న నాయకులు

కాట్రేనికోన: సంక్షేమ రాజ్యం కొనసాగాలంటే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి కావాలని, ఇదే విషయాన్ని ప్రజలు ముక్త కంఠంతో చెబుతున్నారని ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా వ్యవసాయ సలహా మండలి సభ్యుడు నడింపల్లి సూరిబాబు అన్నారు. చెయ్యేరు గ్రామ సచివాలయం పరిధిలో మండల పార్టీ కన్వీనర్ నల్లా నరసింహమూర్తి ఆధ్వర్యంలో శనివారం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం జరిగింది. నాయకులు ఇంటింటికీ వెళ్లి కరపత్రాలను పంచుతూ ప్రజల అభిప్రాయాలను సేకరించారు. అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్న ప్రభుత్వాన్ని ప్రజలు ఆశీర్వదించాలని నాయకులు కోరారు. రాబోయే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి ముమ్మిడివరం ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్‌ను మళ్లీ గెలిపించాలన్నారు. కార్యక్రమంలో బసవా రామలక్ష్మణరావు, మొల్లేటి గోవిందరావు, సుధా సత్తిబాబు, ఊటుకూరి నాగభూషణం, దూనబోయిన నాగేశ్వరరావు, ఉంగరాల అబ్బులు, ఉదయ్ తదితరులు పాల్గొన్నారు.

29న అల్లవరంలో జగనన్నకు చెబుదాం

అమలాపురం రూరల్: ఈ నెల 29వ తేదీన ఉదయం 10 గంటల నుంచి అల్లవరం ఎంపీడీవో కార్యాలయంలో జగనన్నకు చెబుదాం స్పందన కార్యక్రమం జరుగుతుందని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో తనతో పాటు జాయింట్ కలెక్టర్, జిల్లా, మండల స్థాయి అధికారులందరూ పాల్గొంటారని, అర్జీదారులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

భక్తిశ్రద్ధలతో కోటి దీపాల మహోత్సవం


శ్రీలక్ష్మీనారాయణ స్వామి ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే జగ్గిరెడ్డి

ఆలమూరు: కార్తికమాస క్షీరాబ్ధి ద్వాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని నర్సిపూడిలో 33వ కోటి దీపాల మహోత్సవం జరిగింది. స్థానిక ఊర చెరువు మధ్యలో నిర్మించిన శ్రీలక్ష్మీనారాయణ ఆలయంలో శుక్రవారం రాత్రి నిర్వహించిన కోటి దీపాల మహోత్సవానికి విశేష స్పందన లభించింది. ఈ కార్యక్రమానికి కొత్తపేట ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని వేద పండితుల మంత్రోచ్ఛరణల మధ్య ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎస్సార్ సీపీ నేతలు చల్లా వెంకట సుబ్రహ్మణ్యం, చల్లా పద్మ, కడలి వెంకటరమణ, టేకి రాంబాబు ఆధ్వర్యంలో నిర్వాహకులు ఆలయ మర్యాదలతో ఘన స్వాగతం పలికారు. భక్తులు స్వామి వారిని దర్శించుకునేందుకు వీలుగా ఆలయ కమిటీ క్యూలైన్లను ఏర్పాటు చేసింది. ఆలయం వద్ద ఏర్పాటు చేసిన సంగీత విభావరి, సాంస్కృతిక, ఆధ్యాత్మిక కార్యక్రమాలను అందరినీ ఆకట్టుకున్నాయి. సర్పంచ్ కందిబొట్ల శ్రీనివాసు, ఎంపీటీసీ మేడిశెట్టి సుబ్బారావు, ఉండమట్ల వెంకటేశ్వర్లు, పురపాకల సత్యనారాయణ, పేరూరి వీరాబాబు, గుత్తుల కామరాజు ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

వైఎస్సార్ బీమా తక్షణ సాయం అందజేత


వెంకటరమణ భార్య సత్యనారాయణమ్మకు రూ.10 వేలు అందజేస్తున్న సర్పంచ్ సూరిబాబు తదితరులు

తాళ్లరేవు: ఇటీవల జి.వేమవరం రామాలయంపేట గ్రామానికి చెందిన యర్రంనీడి వెంకటరమణ విద్యుదాఘాతంతో మృతి చెందడంతో వైఎస్సార్ బీమా మంజూరైంది. వెంకటరమణ భార్య సత్యనారాయణమ్మకు సర్పంచ్ పుణ్యమంతుల సూరిబాబు, ఎంపీటీసీ సభ్యుడు యర్రంనీడి అప్పారావు మట్టి ఖర్చుల నిమిత్తం వచ్చిన వైఎస్సార్ బీమా తక్షణ సాయం రూ.10 వేలను శనివారం అందజేశారు. మిగిలిన నగదు బ్యాంకు ఖాతాలో జమ అవుతుందని తెలియజేశారు. పేద కుటుంబాలకు వైఎస్సార్ బీమా ఎంతగానో ఉపయోగపడుతుందని సర్పంచ్ సూరిబాబు అన్నారు. కార్యక్రమంలో శ్రీపాదం నూకరాజు, వెల్ఫేర్ అసిస్టెంట్ హరిత తదితరులు పాల్గొన్నారు.

వెంకన్నకు ఉయ్యాల సేవ


స్వామికి ఉయ్యాల సేవ చేస్తున్న ఆలయ ధర్మకర్త వర్మ దంపతులు

అమలాపురం టౌన్: స్థానిక వేంకటేశ్వర స్వామి ఆలయంలో స్వామి వారి ఉయ్యాల సేవ శనివారం వైభవంగా నిర్వహించారు. ఆలయ ధర్మకర్త నడింపల్లి వర్మ, పద్మావతి దంపతుల చేతుల మీదుగా అర్చకులు ఉయ్యాల సేవను జరిపారు. ఆలయ చైర్‌పర్సన్ దూడల వెంకట విరీతాదేవి, ఈవో దూనబోయిన సాయిబాబు, ధర్మకర్తలు, భక్తులు పాల్గొన్నారు. శనివారం కావడంతో స్వామి దర్శనానికి వేలాది మంది భక్తులు రావడంతో ఆలయ ప్రాంగణం కిక్కిరిసింది. అనంతరం భక్తుల కోసం అన్నదానం, ప్రసాద వితరణ చేశారు.

యువత ఓటు నమోదుకు ముందుకు రావాలి

ఆర్డీవో కేశవవర్ధనరెడ్డి సూచన



విద్యార్థులకు ఓటు నమోదుపై అవగాహన కల్పిస్తున్న ఆర్డీవో కేశవవర్ధనరెడ్డి

అమలాపురం టౌన్: 18 ఏళ్లు దాటిన విద్యార్థులంతా చైతన్యంగా ఓటు నమోదుకు ముందుకు రావాలని అమలాపురం ఆర్డీవో జి.కేశవవర్ధనరెడ్డి సూచించారు. శనివారం స్థానిక శ్రీవెంకటేశ్వర డిగ్రీ కళాశాలలో సిస్టమెటిక్ ఓటర్స్ ఎడ్యుకేషన్ అండ్ ఎలక్ట్రోల్ పార్టిసిపేషన్(ఎస్‌వీఈఈపీ) కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు ఓటు నమోదుపై అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమానికి ఆర్డీవో ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. విద్యార్థులంతా 18 ఏళ్లు నిండగానే ఓటు నమోదు చేసుకుని ప్రజాస్వామ్యంలో జరిగే ఎన్నికల ప్రక్రియలో భాగస్వాములు కావాలని అవగాహన కల్పించారు. మున్సిపల్ కమిషనర్ ఒమ్మి అయ్యప్పనాయుడు, తహసీల్దార్ పరమట శ్రీపల్లవి ప్రసంగిస్తూ విద్యార్థులు ఓటు అర్హత సాధించి ఆ హక్కును ఓ ఆయుధంలా ఉపయోగించుకోవాలని సూచించారు. ఓటు ఎలా నమోదు చేసుకోవాలి, ఏ ఫారం పూర్తి చేయాలి వంటి అంశాలపై అవగాహన కల్పించారు. ఆర్డీవో కేశవవర్ధనరెడ్డి, తహసీల్దార్ పల్లవి, కమిషనర్ నాయుడును కళాశాల సెక్రటరీ కేవీఆర్ఎస్ నరసింహరావు, ప్రిన్సిపాల్ కె.మనోహర్, వైస్ చైర్మన్ కరాటం ప్రవీణ్ తదితరులు ఘనంగా సత్కరించారు.

యశ్వంత్‌కు రజత పతకం


రాష్ట్ర స్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో రజత పతకం అందుకున్న యశ్వంత్(బ్లూ టీషర్ట్ వేసుకున్న క్రీడాకారుడు)

అమలాపురం టౌన్: కర్నూలులో జరిగిన అండర్–19 స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ రాష్ట్ర స్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో అమలాపురం హెల్త్ అండ్ ఫిట్‌నెస్ జిమ్ క్రీడాకారుడు బి.యశ్వంత్ ద్వితీయ స్థానాన్ని సాధించి రజత పతకాన్ని కైవసం చేసుకున్నాడు. ఇదే జిమ్‌కు చెందిన మరో క్రీడాకారుడు పి.తరుణ్ తేజ నాలుగో స్థానాన్ని గెలుచుకున్నాడు. యశ్వంత్ స్నాచ్ 86 కేజీలు, క్లీన్ అండ్ జర్క్ 110 కేజీలతో మొత్తం 196 కేజీల బరువులెత్తి రాష్ట్ర స్థాయిలో ద్వితీయ స్థానాన్ని సాధిస్తే, తరుణ్‌తేజ 115 కేజీల బరువెత్తి నాలుగో స్థానాన్ని దక్కించుకున్నాడని జిమ్ కోచ్ డాక్టర్ కంకిపాటి వెంకటేశ్వరరావు తెలిపారు. విజేతలిద్దరినీ జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు యెనుముల కృష్ణ పద్మరాజు, జిల్లా అసోసియేషన్ ప్రతినిధులు చీకురుమిల్లి కిరణ్‌కుమార్, బి.అప్పన్న, ఎంవీ సముద్రం, పొనకల దుర్గాప్రసాద్, పిల్లి సాయిబాబా అభినందించారు.

కనకదుర్గ ఆలయానికి శంకుస్థాపన


కనకదుర్గ ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న భక్తులు

తాళ్లరేవు: కోరంగి పంచాయతీ సీతారామపురంలోని ఆత్రేయ గోదావరి నది కోలాటివారి రేవు వద్ద విజయ కనకదుర్గ అమ్మవారి ఆలయానికి శనివారం శంకుస్థాపన చేశారు. కందికొండ భాస్కరశర్మ నేతృత్వంలో ప్రత్యేక పూజలు నిర్వహించి భూమి పూజ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు కాదా గోవిందకుమార్, ముమ్మిడివరం మార్కెట్ కమిటీ డైరెక్టర్ సంగాని వీరనాగేశ్వరి, సంగాని దాసు, విశ్వనాథపల్లి సత్తిబాబు, సంగాని చినబాబు, దోమా మీరాసాహెబ్, వైదాడి వరపుత్ర పాల్గొన్నారు.